# సాక్షి ములుగు

గురువారం । 28 । డిసెంబర్ । 2023






**'మత్తు' రహిత కమిషనరేట్‌గా..**

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌ను మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు.

- 8లో



**నేటి నుంచి ఐహెచ్‌సీ సెషన్**

ప్రతిష్టాత్మక ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ (ఐహెచ్‌సీ) నేటి నుంచి కేయూలో ప్రారంభం కానుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఐహెచ్‌సీ సభ్యులు కేయూకు చేరుకుంటున్నారు.

- 8లో

గరిష్టం/కనిష్టం
$30.0^0/16.0^0$

**వాతావరణం**

జిల్లాలో ఉదయం పొగ మంచు కమ్ముకుని ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో చలి ఎక్కువగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### రామప్పను సందర్శించిన ఈజిప్టు దేశస్తులు



**వెంకటాపురం(ఎం):** ప్రపంచ ప్రసిద్ధి చెందిన రామప్ప దేవాలయాన్ని బుధవారం ఈజిప్టు దేశానికి చెందిన నాడా హైదర్, లొంబ్నారీడా, డీనా రాహెడ్‌లు సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరస్వామికి వారు పూజలు నిర్వహించగా ఆలయ అర్చకుడు హరీశ్ శర్మ వారికి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. టూరిజం గైడ్ విజయ్‌కుమార్ ఆలయ విశిష్టత గురించి వివరించగా రామప్ప టెంపుల్ బ్యూటిఫుల్ అంటూ కొనియాడారు.

### విద్యార్థులు లక్ష్యంతో చదవాలి



**టేకుమట్ల:** విద్యార్థులు లక్ష్యంతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కమ్యూనిటీ మొబిలైజ్ ఆఫీసర్(సీఎంఓ) కిషన్ రావు, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఎంఓ) లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని ఆశిరెడ్డిపల్లి, పంగిడిపల్లి, గర్మిళ్లపల్లి గ్రామాల్లో పాఠశాలలను సందర్శించారు. ఎఫ్ఎల్ఎన్ ఉన్నతి లక్ష్యం అమలును పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రేషన్ డీలర్ల జిల్లా కమిటీ ఎన్నిక



**భూపాలపల్లి రూరల్:** రేషన్ డీలర్ల సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు నూతన అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలాల కమిటీల సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ఓటింగ్ ద్వారా కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎరుకొండ రాజేంద్ర ప్రసాద్‌తోపాటు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

### స్వాతంత్య్ర సమరయోధురాలి మృతి

**రేగొండ:** మండలంలోని రేపాకపల్లి గ్రామానికి చెందిన స్వాతంత్య్ర సమరయోధురాలు చేరి వెంకమ్మ (95) మంగళవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రజా ఉద్యమాల్లో ఆమె కీలక భూమిక పోషించారు. వెంకమ్మ మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మృతురాలికి నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

### పొగమంచుతో జాగ్రత్త



**భూపాలపల్లి:** చలికాలం కావడంతో ఉదయం సమయంలో కురుస్తున్న పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, ప్రమాదాలు జరగకుండా వాహనాన్ని డ్రైవింగ్ చేసే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ కిరణ్ ఖరే బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. పొగమంచు కురుస్తున్న సమయంలో పరిసరాలను అంచనా వేయడం కష్టంగా ఉంటుంది.. కావున వాహన వేగం తగ్గించాలని తెలిపారు. కనిపించని వాహనాలను వినికిడి ద్వారా గ్రహించే ప్రయత్నం చేయాలని, టైర్లు, హారన్ల శబ్దం కనిపించని వాహనాల దూరాన్ని అంచనా వేయడంలో సహాయపడుతాయని తెలిపారు. పొగమంచులో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు వాహనంలో సంగీతాన్ని నిలిపివేయాలని సూచించారు. తమ లేన్‌లోనే డ్రైవింగ్ చేయాలని, వాహన అద్దాలను తప్పకుండా స్పష్టంగా ఉంచడానికి ప్రయత్నించాలని తెలిపారు. వాహనంలో హీటర్‌ను ఆన్ చేయడం ద్వారా అద్దాలపై మంచును క్లియర్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. మంచు కురుస్తున్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ఓవర్ టేక్ చేయొద్దని వివరించారు. స్వల్ప వ్యవధిలోనే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రయాణం చేస్తున్నంత సేపు డ్రైవర్ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు.

# లక్ష్యం చేరని కొనుగోళ్లు

## నేరుగా ధాన్యాన్ని మిల్లర్లకు అమ్ముతున్న రైతులు

- చివరి దశకు చేరిన సేకరణ
- సన్నాలకు ఫుల్ డిమాండ్



**ములుగు రూరల్:** ఈ ఏడాది వర్షాకాలం వరి ధాన్యం సేకరణలో ప్రభుత్వ అంచనాలు తారుమారయ్యాయి. ప్రభుత్వం ఎప్పటిలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికీ రైతులు నేరుగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ఇంచుమించుగా వ్యాపారులు ధాన్యం అమ్మకాలు చేపడుతున్నారు. ఈ సీజన్‌లో మాత్రం ఎలాంటి అవరోధాలకు తావులేకుండా వరి ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నాయి. గతంలో రైతులు వరి కోతలు చేపట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి కొన్ని రోజుల పాటు ధాన్యం ఆరబోసి కాంటాలు చేపట్టిన మిల్లర్లు కోతలు విధించి రైతులను ఇబ్బందులకు గురి చేసేవారు. కాని ఈ ఏడాది వరి ధాన్యం సేకరణ అందుకు భిన్నంగా కొనసాగుతోంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించేందుకు పెట్టుకున్న టార్గెట్ మాత్రం అందుకోవడం కష్టంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షం కారణంగా వరి కోస్తున్న మిషన్లకు అధిక మొత్తంగా డబ్బులు చెల్లిస్తున్నారు.

**సీఎంఆర్ భర్తీ కోసమేనా..**

జిల్లాలో రైస్ మిల్లర్లకు అప్పగించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వకుండా తమకు కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆ ధాన్యం భర్తీ చేసేందుకు రైస్ మిల్లర్లు నేరుగా రైతుల నుంచి ధాన్యం సేకరణ చేపడుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ ఇంకా పెండింగ్‌లోనే ఉంది.

**తేమశాతంతో పని లేదు..**

వరి కోతలు మొదలు కాగానే మిల్లర్లు రైతులను నేరుగా కలిసి ప్రభుత్వం మద్దతు ధరకు రూ.100 తక్కువ ధరకు తేమ శాతంతో పని లేకుండా కొనుగోలు చేస్తున్నారు. రైతులు మిషన్ల ద్వారా వరికోతలు కోస్తుండగానే ట్రాక్టర్లలో మిల్లులకు తరలిస్తున్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,208 ఉండగా మిల్లర్లు రూ.2100 నుంచి పైకి కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు పూర్తిగా పనిభారం తగ్గుతుంది. వరి ధాన్యం ఆరబోయడం, హమాలీ చార్జీల, బస్తాలు నింపడం, మిల్లులకు తరలించడం వంటి ఖర్చులు పూర్తిగా తగ్గిపోవడంతో రైతులకు పని భారంతో పాటు ఖర్చులు సైతం కలిసి వస్తున్నాయి.

**సన్నాలకు ఫుల్ డిమాండ్**

రైతులు పండించిన సన్నరకం వరి ధాన్యానికి ఈ ఏడాది ఫుల్ డిమాండ్ ఉంది. మిల్లర్లతో పాటు , బియ్యం వ్యాపారులు సన్నరకం వరి ధాన్యం కొనుగోళ్లకు సుముఖత చూపుతున్నారు. వ్యాపారులు సన్న రకం ధాన్యం మరాడించి బియ్యం అమ్మకాలు చేపట్టేందుకు ప్రభుత్వం మద్దతు ధర కంటే ఎక్కువ ధరకు సన్న రకం ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారు. దీంతో సన్నాలకు జిల్లా వ్యాప్తంగా ఫుల్ డిమాండ్ నెలకొంది.

**ధాన్యం సేకరణ వివరాలు**

| | |
|---|---|
| కొనుగోలు కేంద్రాలు | 163 |
| సేకరణ లక్ష్యం(మెట్రిక్ టన్నుల్లో) | 1,20,000 |
| సేకరించిన ధాన్యం (మెట్రిక్ టన్నుల్లో) | 20,175 |
| విక్రయించిన రైతులు | 2,171 |
| కేంద్రాలలో నిల్వ ఉన్న ధాన్యం (మెట్రిక్ టన్నుల్లో ) | 15,097 |
| సొమ్ము జమ అయిన రైతులు | 0 |
| ధాన్యం విలువ | రూ.44.07 కోట్లు |

**కొనుగోలు కేంద్రాలకు తక్కువగా వస్తున్నాయి..**



తొమ్మిది మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కొనుగోలు కేంద్రాలకు రైతులు తక్కువ మొత్తంలో ధాన్యం తీసుకువస్తున్నారు. సన్నరకం ధాన్యం మద్దతు ధరలకు వ్యాపారులు, మిల్లర్లు కొనుగోలు చేయడంతో బి గ్రేడ్ ధాన్యం కేంద్రాలకు వస్తుంది. కాంటాలు పూర్తి అయిన వెంటనే డబ్బులు జమ చేస్తున్నాం. ఈ సారి అంచనాలు చేరుకోవడం కష్టంగా ఉంది.

- రాములు, జిల్లా సివిల్ సప్లయీస్ మేనేజర్

# 'ప్రజా పాలన'ను కట్టుదిట్టంగా నిర్వహించాలి

- ప్రతీ 100 కుటుంబాలకు ఒక కౌంటర్
- ప్రజలు ముందుగానే దరఖాస్తులు నింపుకుని వచ్చేలా చూడాలి
- అదనపు కలెక్టర్ శ్రీజ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

**ములుగు:** జిల్లాలోని ప్రతీ గ్రామ పంచాయతీలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు చేపట్టనున్న ప్రజా పాలన గ్రామసభలను కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులకు అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్(రెవెన్యూ), ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డిలతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ గ్రామసభలో ఆరు గ్యారంటీ పథకాలైన మహాలక్ష్మీ, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత, యువవికాసంకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలని అధికారులకు సూచించారు. ప్రతీ మండల పరిధిలో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓల ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు షెడ్యూల్‌లలో దరఖాస్తులు తీసుకుంటారని వివరించారు. ప్రజలు దరఖాస్తులను ముందుగానే నింపుకొని గ్రామసభకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామసభ నిర్వహణపై ముందస్తుగా తప్పకుండా డప్పుచప్పుళ్లతో టాంటాం వేయించాలన్నారు. ప్రతీ 100 కుటుంబాలకు ఒక ప్రత్యేక కౌంటర్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రతీ దరఖాస్తుకు తప్పనిసరిగా రేషన్‌కార్డు, ఆధార్ కార్డులు జత చేసేలా చూడాలన్నారు. ప్రజలు క్యూ విధానంలో వచ్చేలా చూడాలన్నారు. అధికారులు సమయపాలన పాటించాలన్నారు. గ్రామసభ ముందురోజు దరఖాస్తులు గ్రామానికి అందుతాయని తెలిపారు. నిరక్షరాస్యులు దరఖాస్తులు నింపుకోవడానికి పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు సహకరించాలన్నారు. గ్రామ సభల వద్ద మౌలిక వసతులు కల్పించాలన్నారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లో నమోదు చేయాలని, దరఖాస్తు దారుడికి రశీదు అందించాలన్నారు. పోలీసు శాఖ తరఫున బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో డీపీఓ కొండా వెంకయ్య, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు ఎంపీపీలు, జెడ్పీటీసీలతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డితో కలిసి అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ సన్నాహాక సభను నిర్వహించారు. సెలవు దినాలు మినహా అన్ని రోజుల్లో షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసన్నారు. ప్రజా ప్రతినిధులకు ముందస్తుగానే సమాచారం అందిస్తామని, కార్యక్రమ విజయవంతానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీలు గండ్రకోట శ్రీదేవిసుధీర్‌యాదవ్, సూడి శ్రీనివాస్‌రెడ్డి, బుర్ర రజిత, జెడ్పీటీసీ నామా కరంచంద్ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపాలన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారిగా వాకాటి కరుణ**



**హన్మకొండ అర్బన్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమ పర్యవేక్షణ కోసం ఇప్పటికే గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అధికారులను నియమించారు. తాజాగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు సీనియర్ ఐఏఎస్ అధికారిని వాకాటి కరుణను నోడల్ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో వరంగల్ కలెక్టర్‌గా పనిచేసిన కరుణకు ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉన్న నేపథ్యంలో ఆమెను నోడల్ అధికారిగా నియమించినట్లు తెలుస్తోంది.

# రాజీమార్గంతోనే కేసుల పరిష్కారం

- జడ్జి లలిత శివజ్యోతి
- జిల్లా కోర్టులో 30న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి లలిత శివజ్యోతి

**ములుగు:** జిల్లా కోర్టు ఆవరణలో ఈ నెల 30న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు రాజీమార్గం కుదుర్చుకుని కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పీవీపీ లలిత శివజ్యోతి సూచించారు. కోర్టు ఆవరణలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మాధవితో కలిసి ప్రధాన న్యాయమూర్తి బుధవారం మాట్లాడారు. జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్, సివిల్, భూ తగాదాలు, మోటార్ వెహికిల్ యాక్సిడెంట్, వివాహ, భూ తగాదాలు, బ్యాంకు, చెక్ బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్ ఫండ్, ఇన్సురెన్స్, ఎక్సైజ్, ట్రాఫిక్–ఈ చలాన్ వంటి కేసులను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కేసుల విషయంలో కోర్టుల చుట్టూ తిరగకుండా ప్రశాంత జీవనాన్ని గడపాలంటే వాటిని లేకుండా చేసుకోవాలన్నారు. కక్షిదారులు తమ న్యాయమూర్తుల సహాయంతో కోర్టుకు నేరుగా హాజరుకావాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి సయోధ్య కుదుర్చుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 478 మందికి నోటీసులు జారీ చేసి పరిష్కరించుకోవాలని సూచించామన్నారు. ఇందులో 151 క్రిమినల్, 17 ఎస్‌ఐ యాక్ట్, 38 ఎంఏసీటీ, 24 వివాహ, 48 సివిల్, 297 ప్రి లిటిగేషన్ కేసులు ఉన్నాయని తెలిపారు. కోర్టు ఆవరణలో నాలుగు బెంచీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు.

# గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

**ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్**



వైద్యులతో మాట్లాడుతున్న జగదీశ్

**ములుగు:** గర్భిణులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ములుగు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో ఏటూరునాగారం సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్‌కుమార్‌తో కలిసి వైద్యులతో క్లిష్టతరమైన కాన్పులు, మాతా శిశు సంరక్షణ పోర్టల్ అప్డేట్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీశ్ మాట్లాడుతూ నైపుణ్యమైన సేవలను నిరంతరం అందించడం ద్వారా మాతా శిశు మరణాలు తగ్గించి తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడవచ్చన్నారు. గర్భిణుల వివరాలను రిజిస్ట్రేషన్ చేసి ఎంసీహెచ్ పోర్టల్‌లో పొందుపరచాలని సూచించారు. ఎక్లామ్షియా ఉన్న వారికి, కవలలకు జన్మనిచ్చిన వారికి, రక్తహీనత ఉన్న వారికి నిరంతరం సేవలందించాలని సూచించారు. ప్రసవం అనంతరం నెల రోజుల వరకు తల్లీబిడ్డ క్షేమాన్ని పరిగణలోకి తీసుకొని సూచనలు చేయాలన్నారు. ప్రసవం సమయంలో రక్తస్రావం జరగకుండా చూసుకోవాలన్నారు. సీరియస్‌గా ఉంటే పై ఆస్పత్రులకు రెఫర్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ విపిన్, మాతా, శిశు సంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ పవన్‌కుమార్, డాక్టర్ గౌతమ్ కుమార్, మాస్‌మీడియా అధికారి తిరుపతయ్య, మానిటరింగ్ సూపర్‌వైజర్ భాస్కర్, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# శిఖం భూముల్లో పంటలు సాగు చేయొద్దు

**ఇరిగేషన్ డీఈ రవీందర్‌రెడ్డి**



కాల్వలను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

**వెంకటాపురం(ఎం):** రామప్ప శిఖం భూముల్లో వరి పంటను రైతులు సాగు చేయొద్దని ఇరిగేషన్ డీఈ రవీందర్‌రెడ్డి రైతులకు సూచించారు. రామప్ప సరస్సు కాల్వలను ఆయన ఏఈ నారాయణస్వామితో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ రవీందర్‌రెడ్డి రైతులతో మాట్లాడారు. కాల్వలకు పడిన గండ్లను పూడ్చివేసేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. యాసంగిలో రామప్ప సరస్సు కింద పూర్తి ఆయకట్టు సాగు చేసుకునేందుకు టైబందీ ఖరారు చేయడంతో రామప్ప సరస్సులో 30 అడుగుల వరకు దేవాదుల పైపు లైను ద్వారా నీటిని నింపనున్నట్లు వివరించారు. శిఖం భూముల్లో పంటలు సాగు చేస్తే రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. యాసంగి పంట సాగు కోసం 2024 జనవరి 10న రామప్ప నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు. రామప్ప సరస్సు నుంచి గణపురం సరస్సుకు, పాఖాల సరస్సుకు నీటిని పంపింగ్ చేస్తామని వెల్లడించారు.

# విషాద వరదలు



కొండాయిలో నీట మునిగిన వారి మృతదేహాలు(ఫైల్)


- 11 మందిని మింగిన నీటి ప్రవాహం
- బాధిత కుటుంబాల్లో తీరని మనోవేదన



మేడారంలో చిక్కుకున్న భక్తులను రక్షిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు(ఫైల్)



వరదలో చిక్కుకుని సాయం కోసం చూస్తూ..(ఫైల్)




**ఏటూరునాగారం:** ప్రకృతి విలయతాండవానికి అమాయకులైన ప్రజల ప్రాణాలు నీటిలో కలిసిపోయాయి. 2023వ సంవత్సరం అకాల వర్షాలతో వచ్చిన వరదలకు జిల్లాలో ఒకే రోజు 11 మంది మృత్యువాత పడి విషాదాన్ని నింపింది. 2023లో చోటుచేసుకున్న ప్రమాదాలు ఎప్పుడు జరగలేదని పలువురు వాపోతున్నారు. జిల్లాలో జూలై 27వ తేదీన కురిసిన భారీ వర్షానికి వెంకటాపురం(ఎం) మండల పరిధిలోని బుర్గుపేట పరిధిలో గల మారేడుగొండ చెరువు తెగిపోవడంతో ముగ్గురు గల్లంతయ్యారు. ఇందులో బండ సారయ్య, బండ సారమ్మ, బండ రాజమ్మలు గల్లంతు కాగా బండ సారయ్య మృతదేహం లభ్యమైంది. మిగిలిన ఇద్దరి మృతదేహాలు ఇప్పటివరకు లభించలేదు.

**ప్రాణాలు దక్కించుకున్న భక్తులు**

ఎస్ఎస్ తాడ్వాయి మండల పరిధిలోని మేడారం సమ్మక్క– సారలమ్మలను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు, వ్యాపారులు సైతం జూలై 26వ తేదీన మొత్తం వరద నీటిలోనే ఉండిపోయారు. మరుసటి రోజు 27న ఎన్డీఆర్ఎఫ్ దళాలు భక్తులు సేద తీరుతున్న షెడ్ల వద్దకు పడవను తీసుకొని వెళ్లి రేకులు తొలగించి అందులో ఉన్న ఆంధ్ర నుంచి వచ్చిన భక్తులు, అలాగే జంపన్నవాగు ఒడ్డు వెంట ఉన్న వ్యాపారులతో పాటుగా చెట్ల కొమ్మలను పట్టుకొని ప్రాణాలను కాపాడుకుంటున్న వారిని సుమారుగా 40 మందిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు ఎన్డీఆర్ఎఫ్ కమాండర్, ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ పింటు తరలించారు. వరద ఒకేసారి రావడంతో బయటకు వెళ్లలేక ఇంటి పైకప్పులు, షాపుల కప్పులపై అనేక మంది తలదాచుకున్నారు.

**జంపన్నవాగు ఉప్పొంగి.. 8 మంది మృత్యువాత**

జూలై 27వ తేదీన కురిసిన భారీ వర్షం కారణంగా జంపన్నవాగు ఉప్పొంగింది. దీంతో ఏటూరునాగారం మండల పరిధిలోని కొండాయి, మల్యాలను వరద చుట్టుముట్టడంతో కొండాయి గ్రామంలోని ఇళ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో కొండాయి గ్రామానికి చెందిన గిరిజన మహిళా దబ్బగట్ల సమ్మక్క(60), భార్యాభర్తలు ఎండి. రషీద్(55), కరీమ (45), తండ్రీకొడుకులు ఎండి. షరీఫ్(60), అజహర్(అజ్జు)(25), భార్యాభర్తలు మజీద్‌ఖాన్(65), లాల్‌బీ(60), ఎస్‌కె మహబూబ్‌ఖాన్(58) వరదలో కొట్టుకుపోయి ఒకే సారి 8 మంది మృత్యువాత పడడం బాధాకరం.

### మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేయాలి



రాస్తారోకో చేస్తున్న యూనియన్ బాధ్యులు

**చిట్యాల:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని వెంటనే రద్దు చేయాలని ప్రైవేట్ వాహనాదారుల యూనియన్ అధ్యక్షుడు మాసు రాజయ్య డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో ధర్నా రాస్తారోకో చేపట్టారు. అనంతరం మాసు రాజయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సులో ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలు తమ వాహనాల్లో రావడం లేదని వాపోయారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందిగా మారిందని తెలిపారు. తమ బతుకులను రాష్ట్ర ప్రభుత్వం రోడ్డుపాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మహాలక్ష్మి పథకాన్ని రద్దు చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు అన్నం రఘు, ఓదేల శ్రీహరి, అంబీరు రాజు, మహేష్, గుర్రం భద్రయ్య, రవి, సారంగం పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి



ఎస్పీ గాష్ ఆలం

**ములుగు రూరల్:** వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించాలని, సిగ్నల్ బోర్డులను గమనిస్తూ వాహనాలను నడపాలని ఎస్పీ గాష్ ఆలం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శీతాకాలంలో పొగమంచు కారణంగా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వివరించారు. పొగమంచులో హై బీమ్ హెడ్ లైట్‌లను వినియోగించడం వల్ల డ్రైవర్ దృష్టికి ఆటంకం కలుగుతుందని అందుకని బీమ్ లైట్‌లను, హెడ్ లైట్‌లను మాత్రమే వినియోగించాలని సూచించారు. డ్రైవర్లు వాహనాలను వేగంగా నడపకుండా పక్కన వస్తున్న వాహనాల శబ్దాలను గమనించాలని వివరించారు. వాహనం అద్దాలు, విండోలు స్పష్టంగా కనిపించే విధంగా సరిచూసుకోవాలని తెలిపారు. వాహనంలో హీటర్‌ను ఆన్ చేసుకోవడంతో పాటు ఓవర్ టెక్ చేయకుండా వాహనాల మధ్య దూరం పాటించాలని సూచించారు.

# అథ్లెటిక్స్ టోర్నమెంట్‌కు కేయూ జట్టు

**కేయూ క్యాంపస్:** చెన్నైలోని టీఎస్‌పీఈఎస్ వర్సిటీలో ఈనెల 29 నుంచి జనవరి 1 వరకు నిర్వహించనున్న సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ వర్సిటీ అథ్లెటిక్స్ టోర్నమెంట్‌కు కేయూ అథ్లెటిక్స్ పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ పి.శ్రీనివాస్‌రావు బుధవారం తెలిపారు. ఈజట్టులో ఎ.గౌతమ్ (కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల, ఖమ్మం), ఎస్‌కే లాల్‌పాషా (కవితా డిగ్రీ కళాశాల, ఖమ్మం), కె.దిలీప్ (భద్రుకా డిగ్రీ కళాశాల, ఖమ్మం), సీహెచ్.నవీన్‌కుమార్, కె.రాజు (ఎస్ఆర్‌అండ్ బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల, ఖమ్మం), ఎస్.గోపీచంద్ (కేఎండీసీ, ఖమ్మం), జి.ఉదయ్‌కిరణ్ (ఏబీవీ గౌట్ డిగ్రీ కాలేజీ, జనగామ), డి.గంగాధర్ (యూసీపీఈ కేయూ, ఖమ్మం), బి.అంజీ (ఎస్‌వీడీసీ పరకాల), టి.శ్రావణ్‌కుమార్ (కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ హనుమకొండ)ఉన్నారు.

## మర్రిమిట్టలో విద్యార్థినికి కరోనా

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మర్రిమిట్ట గ్రామంలో ఓ విద్యార్థినికి కరోనా పాజిటివ్ వచ్చింది. గ్రామానికి చెందిన ఓ ఆశ వర్కర్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇందులో పెద్ద కూతురు పదో తరగతి, చిన్న కూతురు 7వ తరగతి చదువుతున్నారు. ఈ క్రమంలో ఇద్దరికీ 3 రోజుల క్రితం దగ్గు, జ్వరం వచ్చింది. దీంతో తల్లి బుధవారం గూడూరు సీహెచ్‌సీకి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించగా చిన్న కూతురుకు పాజిటివ్ వచ్చింది. వైద్యుడు మందులు అందించి నిబంధనలు తెలిపి పంపించినట్లు కమ్యూనిటీ హెల్త్ సూపరింటెండెంట్ వీరన్న తెలిపారు.

## యువకుడి ఆత్మహత్య


ప్రదీప్ (ఫైల్)

హసన్‌పర్తి: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నగరంలోని ముచ్చర్లలో జరిగింది. గ్రామానికి చెందిన మట్టెడ ప్రదీప్(32)కు తన మామ కూతురు మౌనికతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. ప్రదీప్ కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.అయితే కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన ప్రదీప్ బుధవారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తల్లి మనీలా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపీ తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

ఐనవోలు: ఓ వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని ఒంటిమామిడిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై వంగాల నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గోనె సోమలక్ష్మి(70) కి భర్త కొమురయ్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ముగ్గురు కుమారులకు వివాహమై వేర్వేరుగా ఉంటున్నారు. చిన్న కుమారుడు సాయిలు తన భార్యతో గొడవ పడడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో సాయిలు తన తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. ఈ క్రమంలో మద్యం మత్తులో తల్లిదండ్రులను కొడుతుండేవాడు. దీంతో తల్లిదండ్రులు రాత్రి సమయంలో గ్రామంలోని ఆలయంలో నిద్రించేవారు. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీన సోమలక్ష్మి బంధువుల ఇంటికి వెళ్లి 26వ తేదీన రాత్రి ఇంటికి చేరుకుని నిద్రించింది. భర్త కొమురయ్య బుధవారం ఉదయం 6 గంటలకు వచ్చి చూసే సరికి సోమలక్ష్మి మృతి చెంది కనిపించింది. దీంతో కొమురయ్య వెంటనే తన కుమారులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటపై సోమలక్ష్మి పెద్ద కుమారుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు చిన్న కుమారుడు సాయిలుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, సాయిలు పని నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లాడని, ఆ రాత్రి ఇంట్లో లేరని తెలుస్తుండటంతో సోమలక్ష్మి మృతిపై గ్రామంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



# నేటినుంచి ఐహెచ్‌సీ సెషన్


కేయూలో ప్రతినిధుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్న నిర్వాహకులు



వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

**మూడు రోజులు నిర్వహణ**
- కేయూకు చేరుకుంటున్న ప్రతినిధులు
- 1,030వరకు పరిశోధన పత్రాల సమర్పణ
- ముగింపు సభకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరు

కేయూ క్యాంపస్ : ప్రతిష్టాత్మక ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ (ఐహెచ్‌సీ)82వ సెషన్ గురువారం నుంచి కాకతీయ యనివర్సిటీలో ప్రారంభంకాబోతోంది. 29, 30 తేదీల్లో కూడా కొనసాగనుంది. మూడు రోజులు జరిగే సెషన్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. దేశంలో లౌకిక, శాస్త్రీయ దృక్పథమే ధ్యేయంగా ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ ముందుకెళ్తుంది. అలాగే, దేశంలో చారిత్రక అంశాలు, పరిశోధనలతోపాటు సామాజిక ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక అంశాలపై కూడా చర్చిస్తుంది. 1935లో ఏర్పాటైన ఈ సంస్థలో మొత్తం 35వేల మంది సభ్యత్వ కలిగి ఉన్నారు. దేశంలోని ఉన్నత విద్యకళాశాలల హిస్టరీ అధ్యాపకులు, యూనివర్సిటీల హిస్టరీ ఆచార్యులతోపాటు చారిత్రక పరిశోధనల చేసినవారు కూడా ఇందులో సభ్యత్వం కలిగి ఉన్నారు. ఐహెచ్‌సీ చీఫ్ గెస్ట్, జేఎన్‌యూ ప్రొఫెసర్ ఆదిత్య ముఖర్జీ, ఐహెచ్‌సీ జనరల్ సెక్రటరీ, అలీఘడ్ ముస్లిం యూనివర్సిటీ ప్రొఫెసర్ సయ్యద్ అలీ నదీమ్ రిజావి కాకతీయ యూనిర్సిటీకి చేరుకున్నారు.

**కేయూకు చేరుకుంటున్న ప్రతినిధులు**

ఇండియన్ హిస్టరీకాంగ్రెస్ సెషన్‌లో పాల్గొనేందుకు బుధవారం ఉదయం నుంచే దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి ఐహెచ్‌సీ సభ్యులు, ప్రతినిధులు కాకతీయ యూనివర్సిటీకి చేరుకుంటున్నారు. ఇప్పటికే మూడు వందల మందికిపైగా ప్రతినిధులు చేరుకోగా వారికి నగరంలోని వివిధ చోట్లతోపాటు యూనివర్సిటీలోని రెండు హాస్టళ్లలో వసతి కల్పిస్తున్నారు.

**1030 పరిశోధన పత్రాల సమర్పణ**

ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్‌లో సమర్పించడానికి 1030 పరిశోధన పత్రాలు వచ్చాయి. ఒకేసారి ఆరు సెషన్లలో ఈ పత్రాలను సమర్పించబోతున్నారు. మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులు సెషన్‌లు జరగనున్నాయి. 12వందల మందికిపైగా ప్రతినిధులు హాజరవుతారని భావిస్తున్నారు.

**రైల్వేస్టేషన్ల వద్ద హెల్ప్‌డెస్క్‌లు**

ఐహెచ్‌సీ సమావేశాలకు దేశంలోని వివిధ చోట్ల నుంచి వస్తున్న ప్రతినిధుల కోసం యూనివర్సిటీ అధికారులు వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్ల వద్ద హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటుచేశారు. ప్రతినిధులకు స్వాగతం పలికి వారు యూనివర్సిటీకి చేరేలా సమాచారం అందిస్తున్నారు.

**చీఫ్ గెస్ట్‌గా నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్ మృదులా ముఖర్జీ**

ఐహెచ్‌సీ ప్రారంభ సమావేశానికి న్యూఢిల్లీలోని నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ మాజీ డైరెక్టర్, జేఎన్‌యూ హిస్టరీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ మృదులా ముఖర్జీ ముఖ్య అతిథిగా హాజరుకాబోతున్నారు. ఇప్పటికే చేరుకున్నారు. మృదులా ముఖర్జీ భారతస్వాతంత్ర్య ఉద్యమంలో రైతులు తమ వంత పాత్ర పోషించడానికి ఎంతో కృషి చేశారు. మృదులా ముఖర్జీ ప్రసిద్ధి చెందిన భారతీయ చరిత్రకారిణి. వలసవాదం, జాతీయ వాదం, మతతత్వ అంశాలపై పరిశోధనలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అలాగే, ఈ సమావేశంలో గౌరవ అతిథిగా ఐహెచ్‌సీ జనరల్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఆదిత్య ముఖర్జీ, ఐహెచ్‌సీ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ ఎస్‌ఏ నదీమ్‌రిజావి పాల్గొంటారు.ఈ సభకు కేయూ వీసీ తాటికొండ రమేష్ అధ్యక్షత వహిస్తారు.

**ముగింపు సభకు డిప్యూటీ సీఎం 'భట్టి' హాజరు**

ఐహెచ్‌సీ సెషన్ ఈనెల 30న ముగియంది. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, గౌరవఅతిథులుగా అటవీ, పర్యావరణం, దేవాదాయశాఖమంత్రి కొండా సురేఖ,పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క , వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు పాల్గొననున్నారు.

# దివ్యాంగుల పట్టుదల ఆదర్శనీయం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- జేఎన్‌ఎస్‌లో ప్రారంభమైన 6వ రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ: వైకల్యం అధిగమించి క్రీడల్లో రాణిస్తున్న దివ్యాంగుల పట్టుదల సమాజానికి ఆదర్శనీయమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో 6వ రాష్ట్ర స్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. 100, 200,400,800, 1500, 5కే మీటర్ల రన్నింగ్, షాట్ పుట్, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్ ఈవెంట్లలో నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జనరల్ సెక్రటరీ, నిర్వాహకుడు గాడిపెల్లి ప్రశాంత్ తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు 2024 జనవరిలో గోవాలోని పనాజీలో జరిగే జాతీయ స్థాయి పారా అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య, ఏషియన్ అథ్లెట్ గోల్డ్ మెడలిస్ట్ దీప్తి, అసోసియేషన్ బాధ్యులు కాల్వ అనిల్, ఎండి. యాకూబ్‌పాషా, వి. కల్యాణ్, శ్రీశైలం, సంతోష్, శ్రీనివాస్, భాగ్య, మమత, రమాదేవి, నరేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సంగయ్య బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సంగయ్య

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శిగా కె.సంగయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంగయ్యకు చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు రవీందర్‌రెడ్డి, వేద ప్రకాశ్, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సారయ్య, జగన్మోహన్, వ్యాపారులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ గ్రేడ్–2 కార్యదర్శులు బియాబానీ, శ్రీరామోజు రాము, శివకుమార్, రాజ్‌కుమార్, మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేశ్
- రాష్ట్ర స్థాయి గురుకుల క్రీడాపోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్

కాటారం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, తద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణిరాకేశ్ అన్నారు. కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో బుధవారం రాష్ట్ర స్థాయి గురుకుల క్రీడాపోటీలను జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి, డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీయడానికి ఇలాంటి క్రీడా పోటీలు దోహదపడుతాయన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభ ఉంటుందని, నిరంతర శిక్షణ పొందడం ద్వారా మరింత మెరుగుపడుతుందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు కాటారం గురుకుల పాఠశాల ఆతిథ్యం ఇవ్వడం సంతోషకరమన్నారు. కాగా, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జోన్‌ల నుంచి 1200 మంది క్రీడాకారులు క్రీడా పోటీల్లో పాల్గొననున్నారు. మొదటి రోజు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు కొనసాగాయి. కార్యక్రమంలో సీఐ రంజిత్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ చల్ల నారాయణరెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ రవికిరణ్, ఆర్‌సీఓ ముత్తయ్య, ప్రిన్సిపాల్ జెకె.బుచ్చయ్య, ఎస్సై అభినవ్, ఉపసర్పంచ్ నాయిని శ్రీనివాస్, పీడీ శ్రీనివాస్, పలు గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, పీడీ, పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

# అనంత మల్లయ్య శర్మకు కన్నీటి వీడ్కోలు

- ముగిసిన అంత్యక్రియలు
- నివాళులర్పించిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు


అనంతమల్లయ్య పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

కాజీపేట: శివక్యం పొందిన అయినవోలు అనంత మల్లయ్య శర్మ సిద్ధాంతికి భక్తులు, బంధు, మిత్రులు అశ్రునయనాల మధ్య కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం కాజీపేట పట్టణంలో అనంత మల్లయ్య శర్మ సిద్ధాంతి అంత్యక్రియలు నిర్వహించారు. విష్ణుపురి కాలనీలో తాను ఎంతో ప్రీతిపాత్రంగా నిర్మించుకున్న స్వయంభూ శ్రీశ్వేతార్క మూలగణపతి దేవాలయ ఆవరణలో ప్రజల సందర్శనార్థం అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి పార్థివదేహం ఉంచారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, సుంచు అశోక్, రావుల సదానందం, ఎండి. అంకూస్, ఆంజనేయులు, బీఆర్‌ఎస్ నాయకులు నార్లగిరి రమేష్, సుంచు కృష్ణ, ప్రజాప్రతినిధులు, అధికారులు. అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి శ్వేతార్క భక్తులు భారీగా తరలిరావడంతో విష్ణుపురి కాలనీ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. అనంతమల్లయ్య పెద్ద కుమారుడు రాధాకృష్ణ శర్మ సంప్రదాయ పద్ధతిలో అంతిమ సంస్కారం జరిపించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

# 5 నుంచి అద్దె బస్సుల బంద్

- ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ అసోసియేషన్ రీజియన్ అధ్యక్షుడు మారిపల్లి రామిరెడ్డి

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీ అధికారుల అనాలోచిత నిర్ణయాలతో అద్దె బస్సుల యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారుల విధానాలకు వ్యతిరేకంగా జనవరి 5 నుంచి అద్దె బస్సుల బంద్ పాటించనున్నట్లు ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు మారిపల్లి రామిరెడ్డి తెలిపారు. 2021లో వర్తింపజేయాల్సిన వేతన సవరణ ఒప్పంద సర్క్యులర్ 38/2022ను ఇప్పుడు వర్తింపజేయాలని చూడడం ఆర్టీసీ అధికారులు అనాలోచిత నిర్ణయానికి నిదర్శనమని బుధవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ లోపభూయిష్ట సర్క్యులర్ వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీకి ప్రయాణికుల సంఖ్య పెరిగిందన్నారు. ఈ క్రమంలో అదనపు బస్సులు సమకూర్చుకునేందుకు అద్దె బస్సుల కోసం టెండర్ పిలిచారని, అయితే నిబంధనలు చూస్తే టెండర్‌లో ఎవరు పాల్గొనకుండా అధికారులు కుట్ర పన్నారని ఆరోపించారు. ఏదైనా కారణంతో ఒక రోజు బస్సు నిలిచిపోతే రోజుకు రూ.35 వేలు రికవరీ చేస్తామని పేర్కొనడం సరికాదన్నారు. గత ప్రభుత్వాలు నియమించిన అధికారులు ప్రస్తుత ప్రభుత్వాన్ని బద్నాం చేయాలనే కుట్రలో భాగమే ఈ నిబంధనలని ఆరోపించారు. ఇప్పటికైనా నిబంధనలు మార్చకపోతే జనవరి 5 నుంచి అద్దె బస్సులు బంద్ చేస్తామని హెచ్చరించారు. సరళ నిబంధనలు రూపొందించాలని సూచించారు.



# 'మత్తు' రహిత కమిషనరేట్‌గా తీర్చిదిద్దాలి

- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా


మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా


పాల్గొన్న పోలీసు అధికారులు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌ను మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దడమే మనందరి ప్రధాన లక్ష్యమని సీపీ అంబర్ కిశోర్ ఝా అన్నారు. సీపీ ఆధ్వర్యంలో బుధవారం ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి వార్షిక నేర సమీక్ష సమావేశం భీమారంలోని శుభం కల్యాణ వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన స్థితిగతులు సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు కేసులను పూర్తి చేయడంలో తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వృత్తిని దైవంగా భావించి మరింత రాణించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పోలీసు స్టేషన్ అధికారులు తమ పీఎస్ పరిధిలో నమోదైన ముఖ్య కేసుల పూర్తి సమాచారం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వరంగల్ పోలీస్ కమిషరేట్ పరిధిలో మత్తు పదార్థాలను కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, కబ్జాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అదే పనిగా కబ్జాలకు పాల్పడే వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై లోతైన విశ్లేషణ జరిపి వాటి నివారణకు తీసుకోవాల్సి ముందస్తు చర్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. నూతన సంవత్సర వేడుకలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. అనంతరం శాసనసభ ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలకు ప్రశంస పత్రాలు అందజేశారు. సమావేశంలో డీసీపీలు రవీందర్, అబ్దుల్ బారి, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

## 29న'కాళేశ్వరం'లో మంత్రుల పర్యటన

- షెడ్యూల్ ఖరారు చేసిన ఇరిగేషన్ శాఖ

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కోసం రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, డి.శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ఈనెల 29న మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల బాటపట్టనున్నారు. బుధవారం ఇరిగేషన్‌శాఖ ద్వారా షెడ్యూల్ ఖరారు చేశారు. అక్టోబర్ 21న బ్యారేజీలోని 7వ బ్లాక్‌లోని 21వ పియర్ కుంగిపోవడం, వారంలోపు అన్నారం సీపేజీ బుంగలు ఏర్పడడంతో కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. క్షేత్రస్థాయి పరిశీలనకు కాళేశ్వరం పయనమవుతున్నారు. దీంతో ఈనెల 29న ఉదయం 10.3 0గంటలకు హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి 11.30గంటలకు కాళేశ్వరం చేరుకుంటారు. 11.30 గంటల నుంచి ఈఎన్‌సీ కాళేశ్వరం ప్రాజెక్టుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ , మేడిగడ్డ బ్యారేజీ పియర్‌లు కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై సమీక్ష జరపనున్నారు. మధ్యాహ్నం 1గంట నుంచి 2 గంటల వరకు మేడిగడ్డ బ్యారేజీ సందర్శించి క్యాంపునకు వెళ్తారు. 2 గంటల నుంచి 3గంటల వరకు మీడియా ప్రతినిధులతో కలిసి భోజనం చేస్తారు. 3 గంటలకు హెలీకాప్టర్‌లో మేడిగడ్డ నుంచి బయలుదేరి 3.20 గంటలకు అన్నారం బ్యారేజీకి చేరుకుంటారు. 3.20 గంటల నుంచి 4.20గంటల వరకు అన్నారం బ్యారేజీ పరిశీలిస్తారు. 4.30 గంటలకు అన్నారం బ్యారేజీ నుంచి బయలుదేరి తిరిగి హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఇప్పటికే ఇరిగేషన్ శాఖ మేడిగడ్డ బ్యారేజీ వద్ద ఏర్పాట్లు చేస్తుంది. హెలీపాడ్ సిద్ధంగా ఉండగా, చదును చేస్తోంది.

## రేపు బస్ డిపోల ముట్టడి


సమావేశంలో మాట్లాడుతున్న సంజీవ

వరంగల్ చౌరస్తా : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళకు ఉచిత బస్ ప్రయాణ సౌకర్యం కల్పించడాన్ని నిరసిస్తూ ఈనెల 29న బస్ డిపోల ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ఆటో యూనియన్ల ఐక్యవేదిక బాధ్యుడు ఇసంపెల్లి సంజీవ తెలిపారు. బుధవారం వరంగల్ గోవిందరాజుల గుట్ట ప్రాంతంలో వివిధ ఆటో యూనియన్ల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంజీవ మాట్లాడుతూ మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు దశల వారీగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో మడికొండ బాబు, ఎండి. సిరాజ్, బొల్లం సంజీవ, శివ ప్రసాద్, రమేష్, శ్రీనివాస్, మనోహర్, జయరాజు, మల్లయ్య, శ్రీధర్ రెడ్డి, పూజారి రవి, సాగర్, నరేష్, సురేష్, చీకటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పీఏసీఎస్‌లు అభివృద్ధి సాధించాలి

- డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు

హన్మకొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు బహుళార్థక సేవా సంఘాలుగా అభివృద్ధి సాధించాలని వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఇన్వెస్ట్‌మెంట్ కమిటీ, పీఏసీఎస్ మల్టీ సర్వీస్‌సెంటర్లలపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పీఏసీఎస్‌ల వారీగా ప్రగతి సమీక్షించారు. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ పీఏసీఎస్‌లు బహుళార్థక సేవా సహకార సంఘాలుగా అభివృద్ధి చెందేందుకు నాబార్డ్, తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంకు తక్కువ వడ్డీకి ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఈ రుణాలతో గోదాంలు, రైస్‌మిల్లుల ఏర్పాటు, సూపర్ మార్కెట్ల నిర్వహణ, వ్యవసాయ సంబంధ వ్యాపారాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్‌లు, సీఈఓలు రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యాపారాభివృద్ధి సాధించాలని సూచించారు. అదే విధంగా రుణాల రికవరీ పూర్తి స్థాయిలో సాధించాలన్నారు. డిపాజిట్ల సంఖ్య పెంచాలని సూచించారు. సమావేశంలో నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, డీసీసీబీ సీఈఓ ఎండి. వజీర్ సుల్తాన్, జీఎం బి.శ్రీధర్, డీజీఎంలు కురువా, రోహిణి, దమయంతి, ఏజీఎంలు రాజశేఖర్, రాధిక, నవీన్, డైరెక్టర్లు సంపల్లి నర్సింగరావు, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

# లభించని శ్రీమాన్ ఆచూకీ

- రోదిస్తున్న తల్లిదండ్రులు
- బయ్యక్కపేటలో విషాద ఛాయలు


శ్రీమాన్‌రెడ్డి గల్లంతైన చోట సముద్ర జలాల్లో వెతుకుతున్న సహాయక సిబ్బంది

ఎస్‌ఎస్ తాడ్వాయి : ఇరాన్ నుంచి కువైట్ వెళ్తున్న షిప్‌లోనుంచి ప్రమాదవశాత్తు సముద్రంలో గల్లంతైన మండలంలోని బయ్యక్కపేట గ్రామానికి చెందిన సర్పంచ్ గుర్రం రమ, సమ్మిరెడ్డి దంపతుల కుమారుడు శ్రీమాన్‌రెడ్డి ఆచూకీ ఇంకా లభించలేదు. దీంతో కుటుంబంతోపాటు గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. శ్రీమాన్.. ఈనెల 21వ తేదీన ఇరాన్ నుంచి కువైట్‌కు ట్రాన్స్‌ఫోర్ట్ షిప్‌లో వెళ్తున్నానని తల్లిదండ్రులు ఫోన్ చేసి తెలిపాడు. కువైట్ నుంచి వచ్చిన తరువాత మళ్లీ ఫోన్ చేస్తానని శ్రీమాన్ తమతో చివరిసారి మాట్లాడాడని తల్లిదండ్రులు రోదిస్తూ తెలిపారు. ఈ నెల 22న కువైట్ వెళ్తున్న క్రమంలో వాతావరణం అనుకూలించకపోవడంతో ప్రమాదవశాత్తు షిప్‌లో నుంచి శ్రీమాన్‌రెడ్డి సముద్రంలో గల్లంతయ్యారని జైపూర్ హెడ్‌క్వార్టర్స్‌గా నడిచే రుద్రాక్ష కన్సల్టెంట్ కంపెనీ యాజమాన్యం తెలిపిందన్నారు. గల్లంతైన సమయంలో షిప్‌లోని ఏడుగురిలో నలుగురు ప్రాణాలతో బయట పడగా వారికి చికిత్స అందిస్తున్నారని, కెప్టెన్‌తో పాటు మరొకరి మృతదేహం లభ్యమైనట్లు సంస్థ ప్రతినిధులు సమాచారం అందించారని తెలిపారు. కానీ తమ కుమారుడి ఆచూకీ మాత్రం ఇప్పటి వరకూ తెలియలేదని కన్నీరుమున్నీరవుతున్నారు. దీనిపై మంగళవారం మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి తమ కుమారుడి ఆచూకీ కోసం ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. దీనిపై మంత్రి సీతక్క.. ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ అధికారులకు పూర్తి వివరాల కోసం సమాచారం అందించినట్లు తెలిపారన్నారు. కాగా, బుధవారం కలెక్టర్.. తమ కుమారుడి మృతదేహం లభ్యమైనట్లు తమకు సమాచారం అందిందని శ్రీమాన్‌రెడ్డి తల్లిదండ్రులకు తెలిపారు. దీనిపై జైపూర్ రుద్రాక్ష సంస్థ ప్రతినిధులను సంప్రదించగా తమకు మాత్రం ఎలాంటి మృతదేహం లభించినట్లు, మరేఇతర సమాచారం లేదని తల్లిదండ్రులకు వివరించారు. దీంతో శ్రీమాన్‌రెడ్డి ఆచూకీ తెలియక తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి తమ కుమారుడి ఆచూకీ అందించడానికి చర్యలు తీసుకోవాలని వారు వేడుకున్నారు.